రాష్ట్రంలోనే నంబర్ వన్ చేస్తా

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాష్ట్రంలో పాలమూరును నంబర్ వన్ చేయడమే తమ ధ్యేయమని రాష్ట్ర ఎక్సైజ్, క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. శనివారం రాత్రి 6, 7, 8, 9వ వార్డుల పరిధి లోని శ్రీనివాసకాలనీ, పద్మావతికాలనీ, టీచర్స్‌కాలనీ, పాలకొండతండా, భాగ్యనగర్‌కాలనీలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తనను మళ్లీ గెలిపిస్తే ప్రజలను ధనికులను చేయడమే లక్ష్యంగా పని చేస్తానన్నారు. పట్టణంలోని శివారు కాలనీలు, తండాలను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రధాన పార్టీల అభ్యర్థులు డబ్బులు విచ్చలవిడిగా వెచ్చించి ఓటర్లను కొనేందుకు యత్నిస్తున్నారని ఆరోపించారు. పద్మావతికాలనీలో మహిళలు కోలాటం వేసి, బతుకమ్మలతోపాటు మంగళ హారతులిచ్చి మంత్రికి ఘనస్వాగతం పలికారు. అలాగే మరికొందరు రాఖీలు కట్టారు. కార్యక్రమాల్లో మాజీ మంత్రి చంద్రశేఖర్, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, ముత్యాల ప్రకాష్, కౌన్సిలర్లు కట్టా రవికిషన్‌రెడ్డి, మూషా నరేందర్ పాల్గొన్నారు.


పాలకొండతండాలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

సొంత గూటికి చేరిన కొనగంటిపల్లి నాయకులు

హన్వాడ: మండలంలోని కొనగంటిపల్లికి చెందిన పలువురు నాయకులు శనివారం మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మంత్రి మండలంలోని మదారం, అమ్మాపూర్ తండా, నాగంబాయితండా, యర్రోనిపల్లి, కొనగట్టుపల్లిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అనేక సంక్షేమ పథకాలు చేపట్టారని, రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమని తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలోని ప్రతి పథకాన్ని అమలు చేసి తీరుతామని అన్నారు.


పద్మావతి కాలనీలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు రాఖీలు కడుతున్న మహిళలు

బీఆర్ఎస్‌లో చేరికలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో మైనార్టీ నాయకులు, ముదిరాజ్‌సంఘం నాయకులు పార్టీలో చేరారు. ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాజు, యూనియన్ నాయకులు మద్దతు ప్రకటించారు.

పాలమూరులో బీజేపీ గెలుపు ఖాయం


జిల్లా కేంద్రంలో ప్రచారం నిర్వహిస్తున్న అభ్యర్థి మిథున్‌రెడ్డి

పాలమూరు: ప్రతి బీజేపీ కార్యకర్త బాధ్యతగా తీసుకుని, పార్టీ అభ్యర్థి మిథున్‌రెడ్డి గెలుపుకోసం పనిచేయాల్సిన సమయం వచ్చిందని కేంద్ర మంత్రి భగవంతు కూబ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. పాలమూరు ప్రజలు, ఓటర్లు మిథున్‌రెడ్డిని ఆశీర్వదించి భారీ మెజార్టీతో గెలిపించాలి కోరారు. నియోజకవర్గంలో మిథున్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభిస్తుందన్నారు. అభ్యర్థి గ్రామాలు, పట్టణంలో విస్తృతంగా పర్యటించినప్పుడూ భారీ సంఖ్యలో ప్రజలు హాజరై ఆయనకు ఘనంగా స్వాగతిస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ప్రజలను ప్రలోభ పెడుతున్నారని ఆరోపించారు. యువకుడైన తమ పార్టీ అభ్యర్థిని ఓడించడానికి బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు కుట్రలు చేస్తున్నారని, వారి కుట్రలను ఛేదించి మిథున్‌రెడ్డి విజయం సాధిస్తాడన్నారు. పార్టీ అభ్యర్థి గెలిస్తే నియోజకవర్గంలో వ్యాపారులు, ప్రజలను ఈ భయానక వాతావరణం నుంచి బయట వేస్తారని తెలిపారు. ఈనెల 30న ఎన్నికల్లో ప్రజలు భారీ సంఖ్యలో తమకు ఓట్లు వేయబోతున్నారని, డిసెంబర్ 3న విజయోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయకార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వీర బ్రహ్మచారి పాల్గొన్నారు.

నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తాం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: తనను గెలిపిస్తే పట్టణంలో యువత భవిష్యత్ కోసం నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని బీజేపీ అభ్యర్థి ఏపీ మిథున్‌రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం రాత్రి స్థానిక వ్యవసాయ మార్కెట్, కొత్తగంజ్ తదితర ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ నేతలు అభివృద్ధి పనుల పేరిట అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు.

దేశానికే ఆదర్శం కేసీఆర్ పాలన


కోటకొండలో ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేసి, అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని కోటకొండలో ఇంటింటా ప్రచారం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి సంక్షేమాన్ని, ప్రస్తుత మేనిఫెస్టోని వివరిస్తూ కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్, బీజేపీలకు చెందిన నేతలు చేస్తున్న విషప్రచారాన్ని నియోజకవర్గంలో అన్ని స్థాయిలో పార్టీ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొడుతున్నారన్నారు. అధికారమే పరమావధిగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్, బీజేపీ కుట్రలు ప్రజలకు అర్థమవుతుందన్నారు. ఎమ్మెల్యే సతీమణి స్వాతిరెడ్డి జిల్లా కేంద్రంలోని 6వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీఆర్ఎస్‌లో చేరికల జోరు

నియోజకవర్గంలోని వివిధ పార్టీలకు చెందిన వారు పార్టీలో చేరడంతో వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. దామరగిద్ద మండలం అన్నసాగర్ చెందిన రాజా, రాములు ఆధ్వర్యంలో 30 మంది బీఆర్ఎస్‌లో చేరారు. మరికల్ మండలంలోని పెద్ద చింతకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు పలువురు మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు.

మరికల్: ఎమ్మెల్యే అభ్యర్థి రాజేందర్‌రెడ్డిని గెలిపించాలని మండలంలోని ఆయాగ్రామాల్లో శనివారం మండల ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ గెలిస్తే మరిన్ని సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికే మద్దతు


మాట్లాడుతున్న ఇంద్రసేనారెడ్డి

పాలమూరు: స్థానికంగా అందుబాటులో ఉంటూ సమితికి వెన్నుదన్నుగా ఉన్న వారికి మా మద్దతు ఉంటుందని, బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి మద్దతు ఇవ్వడానికి తీర్మానం చేశామని రెడ్డి సేవా సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఒక రాజకీయ పార్టీకి మద్దతు ఇవ్వమని రెడ్డి సంఘాల తరుపున ఓ పత్రికా సమావేశంలో చెప్పడాన్ని ఖండిస్తున్నామని, ఇది వారి వ్యక్తిగత అభిప్రాయమని, రెడ్డి సేవాసమితికి సంబంధం లేదన్నారు. మహబూబ్‌నగర్‌లో రెడ్డిసేవా సమితికి మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి చేసిన సేవలు ఎంతో ఉందన్నారు. ఆయన లేకుండా సమితి లేదని, ఆయన పదవిలో ఉన్నా లేకున్నా అందరికి అందుబా టులో ఉన్నారని గుర్తు చేశారు. కేవలం ఎన్నికల సమయంలో వచ్చి లబ్ధి పొందాలని కొంతమంది వ్యక్తులు వస్తుంటారని, మనకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వ్యక్తిని మద్దతు తెలపాల్సిన అవసరం ఉందన్నారు. అదే విధంగా ఉమ్మడి జిల్లాలో ఏ పార్టీ అయినా రెడ్డి సేవా సమితికి చేయూత అందించి ఇతర సామాజిక సేవా కార్యక్రమాల్లో సహకరించి న అభ్యర్థులకు మద్దతు తెలపాలని కోరారు. సమావేశంలో రాజేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పోతుల రాఘవారెడ్డి, పరమేశ్వర్‌రెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిల్లర రాజకీయాలు మానుకోండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

జడ్చర్ల: ఎన్నికల సమయంలో చిల్లర రాజకీయాలు చేయకుండా హుందాగా విలువలతో కూడిన రాజకీయాలు చేయాలని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హితవు పలికారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. విపక్ష పార్టీ అభ్యర్థి ఒకరు తమపై ఇష్టానుసారంగా విచక్షణ కోల్పోయి మాట్లాడడం సరికాదన్నారు. డబ్బులు వెదజల్లి నాయకులను, ఓటర్లను కొనుగోలు చేయడం దురదృష్టకరమన్నారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి రాజకీయాలను చూడలేదన్నారు. ప్రజలు మళ్లీ బీఆర్ఎస్‌ను కోరుకుంటున్నారని, తాను గత మెజార్టీని అధిగమించి విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

నవాబుపేట: కాంగ్రెస్ పార్టీ మాయమాటలకు బలి కావద్దని బీఆర్ఎస్ జడ్చర్ల అభ్యర్థి లక్ష్మారెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రానికి చెందిన పలువురు నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఆయన కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: బాలల హక్కుల రక్షణ అందరి బాధ్యత అని జిల్లా సివిల్ జడ్జి సంధ్యారాణి పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో బాలల హక్కులపై నిర్వహించిన సెమినార్‌కు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

పాలమూరు: బాలల హక్కుల పరిరక్షణ ప్రతిఒక్కరి బాధ్యత అని, ఈతరం బాల, బాలికలు చదువుపై ప్రత్యేక దృష్టిపెట్టడంతోపాటు ఉన్నత లక్ష్యం వైపు ప్రయాణం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, యూనిసెఫ్–ఎకో క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కళాశాలలో బాలల హక్కుల పరిరక్షణపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరై మాట్లాడారు.

రాజీ అయ్యే కేసులు గుర్తించాలి

మహబూబ్‌నగర్ క్రైం: వచ్చే నెల 12న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాజీ కావడానికి అవకాశం ఉన్న కేసులు గుర్తించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సంధ్యారాణి అన్నారు. శనివారం ఎస్ఐలతోపాటు కోర్టు డ్యూటీ నిర్వహించే కానిస్టేబుళ్లు, ఇతర పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు.

ముమ్మరంగా ప్రచారం

అన్ని వర్గాలకు ఆమోదయోగ్యం

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ఆమోదయోగ్యమైన మేనిఫెస్టోను కాంగ్రెస్ పార్టీ తీసుకొచ్చినట్లు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే అభ్యర్థి యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే జాబ్‌క్యాలెండర్ ప్రకటిస్తామని తెలిపారు.

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ విజయం

కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ గెలుపు ఖాయమని యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండలంలోని అల్లీపూర్, జమిస్తాపూర్, చౌదర్‌పల్లి, బొక్కలోనిపల్లి గ్రామాలలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను ఆశీర్వదించండి

కోయిల్‌కొండ: పేద ప్రజలకు ఆరు గ్యారంటీ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ఆశీర్వదించి ఓటు వేయాలని నారాయణపేట ఎమ్మెల్యే అభ్యర్థి పర్ణికారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జమాల్‌పూర్, పల్గుతండా, ఉబ్బిడితండా, ఎల్లారెడ్డిపల్లి తదితర గ్రామాలలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు

మహమ్మదాబాద్: కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు ప్రజలు నమ్మవద్దని బీఆర్ఎస్ పరిగి నియోజకవర్గ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి సతీమణి ప్రతిమారెడ్డి తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల కేంద్రంలో ప్రచారం నిర్వహించారు.

మైనార్టీల అభ్యున్నతికి కేసీఆర్ కృషి

గండేడ్: మైనార్టీల అభ్యున్నతికి కేసీఆర్ ఎంతగానో కృషి చేశారని రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో మైనార్టీలతో సమావేశం నిర్వహించారు. మైనార్టీలకు బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక పెద్దపీట వేశారని తెలిపారు.

బీఆర్ఎస్‌ను నమ్మితే మోసమే

అడ్డాకుల: ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ ఓట్లడుగుతున్న బీఆర్ఎస్‌ను నమ్మితే మోసపోవడం తప్ప మరొకటి లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మూసాపేట మండలంలోని జానంపేట, నిజాలాపూర్, మూసాపేటలో శనివారం రాత్రి ఆయన ప్రచారం చేశారు.

భూత్పూర్‌లో బీఆర్ఎస్ ప్రచారం

భూత్పూర్: మండలంలోని ఎల్కిచర్లలో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సతీమణి ఆల మంజుల ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్ఎస్ చేపట్టిన అభివృద్ధి, చేపట్టబోయే కార్యక్రమాలను మేనిఫెస్టో చూపిస్తూ సీఎం కేసీఆర్‌గా, దేవరకద్ర ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, సర్పంచ్ పద్మ, కౌన్సిలర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

చెప్పింది చేయటమే కాంగ్రెస్ నైజం

నవాబుపేట: చెప్పింది చేయటమే కాంగ్రెస్ పార్టీ నైజమని తెలంగాణ ఇన్‌చార్జ్, కాంగ్రెస్ పార్టీ జాతీయ అధికారప్రతినిధి అన్సుమన్‌స్రాయిల్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆయన సమావేశం ఏర్పాటు చేశారు. కర్ణాటకలో చెప్పింది చేసి చూపిస్తున్నామని ఇక్కడ తప్పుడు ప్రచారం చేసి కాంగ్రెస్‌ను ఓడించాలని బీఆర్ఎస్ చూస్తుందని విమర్శించారు. తెలంగాణ ప్రజలు సోనియాగాంధీ రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. హర్షవర్ధన్‌రెడ్డి, జహీర్ అక్తర్, రాంచంద్రయ్య, షబ్బీర్ ఉన్నారు.

బీసీ గురుకుల విద్యార్థుల ఆందోళన



దేవరకద్ర: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులు శనివారం ఆందోళన చేశారు. నీటి సమస్యతో సతమతమవుతున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు పాఠశాల బయట బైటాయించి ధర్నాకు దిగారు. సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళన విరమించేది లేదని నినాదాలు చేశారు. పాఠశాల ప్రిన్సిపాల్ అమరేష్ ఇతర అధికారులు అక్కడికి వచ్చి ఆందోళనను విరమించాలని విద్యార్థులకు నచ్చచెప్పారు. నీటి సమస్యను వెంటనే పరిష్కరిస్తామని, ఇతర సమస్యలను రెండు, మూడు రోజుల్లో పరిష్కరిస్తామని హామి ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

నేటి నుంచి ఓపెన్ యూనివర్సిటీ తరగతులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సెమిస్టర్ 3, 5 తరగతులు ఆదివారం నుంచి ప్రారంభిస్తున్నట్లు రీజినల్ కోఆర్డినేటర్ సత్యనారాయణగౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సకాలంలో తరగతులకు హాజరుకావాలని ఆయన కోరారు.

అభ్యర్థులతో అధికారుల సమీక్ష

దేవరకద్ర: శాసనసభ ఎన్నికలలో భాగంగా శనివారం అసెంబ్లీ నియోజవర్గానికి సంబంధించి ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతినిధుల సమక్షంలో జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్రా, కలెక్టర్ రవి నాయక్ ఈవీఎంల రెండో విడత ర్యాండమైజేషన్ నిర్వహించారు.

ఘనంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

గండేడ్: మండలంలోని వెన్నాచేడ్‌లో విగ్రహ, బొడ్రాయి, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శనివారం ఉదయం నుంచి పూజలు చేపట్టారు. ముందుగా బొడ్రాళ్లకు ఎల్లమ్మ, పోచమ్మ విగ్రహాలకు ధాన్యాధివాసం, జలాధివాసం చేశారు. గ్రామంలోని ఉదయం, సాయంత్రం కలిపి 108 జంటలు హోమంలో పాల్గొన్నాయి. సాయంత్రం శయనాధివాసం ప్రదోశ పూజలు చేశారు.

విద్యార్థికి అభినందన

జడ్చర్ల టౌన్: సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ కబడ్డీ టోర్నీలో పాల్గొనే పాలమూరు యూనివర్సిటీ జట్టుకు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి శివకుమార్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డా. అప్పియాచిన్నమ్మ తెలిపారు. బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న ఈయన ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ ప్రతిభకనబర్చి జట్టుకు ఎంపికైనట్లు ఆమె పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కళాశాలలో జట్టుకు ఎంపికైన క్రీడాకారుడిని అభినందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అధ్యాపక బృందం ఉన్నారు.

శిలాఫలకాల ధ్వంసంపై ఫిర్యాదు

మహమ్మదాబాద్: శిలాఫలకాలు ధ్వంసం చేయడంపై కాంగ్రెస్ నాయకులపై బీఆర్ఎస్ నాయకులు ఫిర్యాదు చేసిన ఘటన మండలంలోని చౌదర్‌పల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. చౌదర్‌పల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ చెందిన తిరుమలయ్యను శుక్రవారం రాత్రి కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. తాను రానని చెప్పడంతో బీఆర్ఎస్ ఎమ్మెల్యే ప్రారంభించిన శిలాఫలకాలను ధ్వంసం చేశారు. ఈ మేరకు చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన ఐదుగురు కాంగ్రెస్ నాయకులపై శనివారం తిరుమలయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. ఈ విషయమై కాంగ్రెస్ నాయకులను వివరణ కోరగా ప్రచారంలో భాగంగా వెళ్లి మాట్లాడమని, ఎలాంటి ధ్వంసానికి పాల్పడలేదని వారు వివరణ ఇచ్చారు.